# మారిన తండా రూపురేఖలు



తార్ రోడ్డు నుంచి సీసీ రోడ్డుగా మారిన సజ్జారావుపేటతండా ప్రధాన రోడ్డు

- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీగా ఏర్పాటు
- మన ఊరు-మనబడిలో కొత్త పాఠశాల భవనం నిర్మాణం
- రూ. 20 లక్షలతో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు
- ప్రతి ఇంటికి మిషన్ భగీరథ తాగునీరు సరఫరా

జహీరాబాద్, అక్టోబర్ 13 : గ్రామాలకు దూరంగా అడవిలో ఉన్న తండాలను పంచాయతీలుగా చేసి ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కలిపించడంతో తండావాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మొగుడంపల్లి మండలంలోని సజ్జారావుపేట తండాను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసి నిధులు మంజూరు చేసింది. తండాలో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, పాఠశాల గదులు, మిషన్ భగీరథలో ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేశారు. తండాల్లో ఉన్న ప్రజలకు గృహలక్ష్మిలో ఇండ్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. పల్లెప్రకృతివనంతో పాటు విద్యార్థులు, యువకులు ఆడుకునేందుకు క్రీడా మైదానం ఏర్పాటు చేశారు.

### అభివృద్ధి వైపు సజ్జారావుపేట తండా..

మొగుడంపల్లి మండలంలోని సజ్జారావుపేట తండా ఉంది. సీఎం కేసీఆర్ తండాలను పంచాయతీలు చేయడంతో గిరిజన ప్రజలు ఏకగ్రీవంగా పవార్ శంకర్‌నాయక్‌ను గ్రామ సర్పంచుగా ఎన్నుకున్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచు తండా అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే మాణిక్‌రావు కృషితో తండా అభివృద్ధి చెందుతున్నది.

### రూ. 30.17లక్షలతో పాఠశాల భవనం నిర్మాణం

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన మనఊరు–మనబడిలో రూ. 30.17లక్షలు మంజూరు చేశారు. తండాలో కొత్తగా పాఠశాల భవనం నిర్మాణం చేసి, వంటగదులు, విద్యార్థుల కోసం మూత్రశాల, మరుగుదొడ్లు నిర్మాణం చేశారు. పాఠశాల పహారీ నిర్మాణంతో పాటు విద్యార్థులకు తాగునీరు, కరెంట్ సౌకర్యం కలిపించారు. కార్పొరేట్ పాఠశాలలో ఉండేవసతులు ఏర్పాటు చేశారు.


### రూ. 20లక్షలతో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు నిర్మాణం

సీఎం కేసీఆర్ గ్రామ పంచాయతీలో ప్రజలకు మౌలిక సదుపాయలు కలిపించేందుకు రూ. 20లక్షలు మంజూరు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో సర్పంచు శంకర్‌నాయక్ తండాలో సీసీరోడ్లు, మురుగు కాల్వలు నిర్మాణం చేపట్టారు. తండాకు వెళ్లే ప్రధాన రోడ్డును సీసీ రోడ్డుగా నిర్మించారు.

### అడవిని తలపిస్తున్న పల్లె ప్రకృతి వనం

గిరిజన తండాలో నిర్మాణం చేసిన పల్లెప్రకృతి వనం అడవిని తలపిస్తుంది. తండాకు సమీపంలో పల్లెప్రకృతి వనం నిర్మాణం చేసి మొక్కలు నాటారు. తండాలో ప్రధాన రోడ్డుకు ఇరువైపుల పచ్చనిచెట్లు పెంచుతున్నారు. ఎక్కడ చూసిన పచ్చదనంతో కనివిందు చేస్తుంది.

### తండాను ఆదర్శంగా అభివృద్ధి చేస్తా



కర్ణాటక సరిహద్దులో ఉన్న సజ్జారావుపేట తండాను నియోజకవర్గంలోనే ఆదర్శ తండాగా అభివృద్ధి చేస్తున్నాం. మంత్రి హరీశ్‌రావు, ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే మాణిక్‌రావు సహకారంతో గిరిజన తండాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నా. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయలు కలిపించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇప్పటికే సీసీ రోడ్లు, మురుగు కాల్వలు నిర్మాణం చేశాం. ప్రతి ఇంటికి తాగునీరు సరఫరా చేస్తు న్నాం. కొత్తగా పాఠశాల భవనం నిర్మాణం చేసి, విద్యార్థులకు మెరుగైన సౌకర్యలు కలిపించాం.

– పవార్ శంకర్‌నాయక్, గ్రామ సర్పంచ్ సజ్జారావుపేట తండా

### బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తండా అభివృద్ధి



బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు మౌలిక సదుపాయలు కలిపించేందుకు నిధులు మంజూరు చేయడం సంతోషంగా ఉంది. తండాలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేస్తున్నారు. గతంలో తాగు నీటి కోసం మహిళలు తీవ్ర ఇబ్బందుతు పడేవారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తాగునీటి కష్టాలు దూరం కావడం జరిగింది. మనఊరు– మనబడి పథకంలో కొత్తగా పాఠశాల భవనం నిర్మాణం చేయడంతో విద్యార్థులకు ఎంతో మేలు కలిగింది. తండాల్లో ఎక్కడ చూసిన పచ్చని చెట్లు కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వానికి గిరిజన ప్రజలు రుణపడి ఉంటారు.

– పవార్ సంజీవ్‌కుమార్, సజ్జారావుపేట తండా

### ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు

మిషన్ భగీరథలో ప్రతి ఇంటి ఎదుట నల్లా ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేస్తుంది. మిషన్ భగీరథలో నల్లా ఏర్పాటు చేసి తాగునీరు సరఫరా చేయడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా ట్యాంకులు నిర్మాణం చేసి నల్లాలు ఏర్పాటు చేయడంతో మహిళలకు తాగునీటి కష్టాలు దూరం అయ్యాయి.




సజ్జారావుపేట తండాలో కొత్తగా నిర్మాణం చేసిన పాఠశాల భవనం



సజ్జారావుపేట తండాలో నిర్మాణం చేసిన పాఠశాల గది

## స్ట్రాంగ్ రూంలను పరిశీలించిన అధికారులు

చౌటకూర్, అక్టోబరు 13: మండలంలోని సుల్తాన్‌పూర్ వద్ద గల జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్ రూంలను ఎన్నికల అధికారులు శుక్రవారం పరిశీలించారు. అందోలు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను భద్రతపర్చేందుకు వీలుగా జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళశాలను ఎంపిక చేశారు. గడిచిన 2018 అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో కూడా జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఈవీఎంలను భద్రపర్చారు. ఎప్పటిలాగే ప్రస్తుతం అందోలు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను ఇక్కడే భద్రపర్చనున్నారు. ఇందులో భాగంగానే అందోలు–జోగిపేట నోడల్ అధికారి పాండు నేతృత్వంలోని డీఎస్పీ బాలాజీ, సీఐ నాగరాజు, తహసీల్దార్ ఈశ్వరరాణి, ఎస్ఐ రాజశేఖర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగరాజు జేఎన్టీయూలో స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. గతంలో ఏఏ గదులను ఈవీఎంల భద్రతకు వినియోగించారు, వాటి రక్షణకు తీసుకున్న జాగ్రత్తలు తదితర అంశాలపై చర్చించారు. పోలింగ్ సిబ్బందికి ఈవీఎంలను కేటాయించేందుకు అనువైన స్థలాన్ని కూడా పరిశీలించారు. అనంతరం మండల కేంద్రం చౌటకూర్‌తో పాటుగా శివంపేట, కోర్పోలు, వెండికోలు, లింగంపల్లి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ వంటి మౌలిక వసతులను పరిశీలించారు.

## అట్టహాసంగా ప్రారంభమైన క్రీడలు

హత్నూర, అక్టోబర్ 13 : ప్రభుత్వం క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తూ క్రీడాకారులకు చేయూతనిస్తుందని సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థ ఓఎస్‌డి లీగల్ అడ్వైసర్ ప్రమీలనాయక్ తెలిపారు. శుక్రవారం మండలకేంద్రమైన హత్నూర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో 9వ జోనల్‌స్థాయి క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తూ క్రీడాపోటీలు నిర్వహిస్తుందన్నారు. గ్రామీన స్థాయి నుంచి రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయికి క్రీడాకారులు క్రీడాపోటీల్లో విజేతలుగా నిలిచి మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. గురుకుల సంస్థల ఆధ్వర్యంలో కొనసాగే క్రీడపోటీల ద్వారా ఎంతోమంది క్రీడాకారులు వారిలో దాగివున్న నైపుణ్యతను చాటుకొని విజేతలుగా నిలిచి ఉన్నత శిఖరాలకు ఎదుగుతున్నట్లు తెలిపారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో దోహదపడుతాయన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని ఓటమిని గెలుపునకు నాందిగా భావించి క్రీడల్లో పాల్గొనాలన్నారు. స్నేహపూరిత వాతావరణంలో క్రీడలు నిర్వహించుకోవాలని సూచించారు. నాలుగురోజుల పాటు జరిగే క్రీడాపోటీల్లో మూడు జిల్లాలకు చెందిన 11పాఠశాల క్రీడాకారులు పాల్గొనుండటంతో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. క్రీడాపోటీల్లో భాగంగా అండర్–14,17,19 విభాగాల్లో క్రీడలు నిర్వహించగా కబడ్డి, ఖోఖో, పుట్‌బాల్, వాలిబాల్, హ్యాండ్‌బాల్‌తోపాటు పలురకాల క్రీడలు జరుగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల, కళాశాల ప్రిన్సిపాళ్లు సుధాకర్, వివేకానంద, సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, పండరి, నర్సింగరావు, ప్రవీన్‌కుమార్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.



క్రీడాకారులతో ఓఎస్‌డీ లీగల్ అడ్వైజర్ ప్రమీలానాయక్

## సహకార వ్యవస్థ రైతన్నకు భరోసా

రాయికోడ్, అక్టోబర్ 13 : ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు అనివసతులు కల్పిస్తూ డీసీసీబీ బ్యాంక్‌ను ఏర్పాటు చేశామని డీసీసీబీ మేనేజర్ ధనుంజయ్ అన్నారు. శుక్రవారం బ్యాంక్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాయికోడ్‌లో డీసీసీబీ బ్యాంక్ ఏర్పాటు చేసి 3 సంవత్సరాలు అయిందన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు, ప్రజలకు తక్కువ వడ్డీకే బంగారంపై రూ. 2.30కోట్లు, మహిళ సంఘాలకు రూ.4కోట్లు, రైతులకు రూ.17కోట్లు, చిరువ్యాపారులకు రూ. 50లక్షలు, విద్య నిమిత్తం రూ. 40లక్షలు, ధీర్ఘకాలనికి సంబంధించిన రూ.4కోట్లు రుణాలను ఇచ్చామని తెలిపారు. ప్రసుత్తం కొత్తగా గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు గృహలను నిర్మాణం చేసుకునేందుకు తక్కువ వడ్డీకే రుణాలను ఇస్తున్నామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో సిబ్బంది రాములు, పుణ్యలక్ష్మి, అనిల్ ఉన్నారు.

## మోడల్ కళాశాలలో ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం

నాగల్‌గిద్ద, అక్టోబర్ 13: వృత్తి విద్యకోర్సు చదివే విద్యార్థులు కోసం ఇంటర్న్‌షిఫ్ ప్రోగ్రాంను శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తివిద్యా కోర్సు చదివే విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుదన్నారు. కార్యక్రమంలో వృత్తి విద్యకోర్సు ట్రైనర్ శేఖర్, అశన్న, అగ్రిమాట్ ఫర్టిలైజర్స్ వీరారెడ్డి, నర్సింహులు, విద్యార్థులు ఉన్నారు.

## కవేలి సంగమేశ్వరాలయంలో చతుర్దశి

కోహీర్, అక్టోబర్ 13: మండలంలోని కవేలి మహాలింగ సంగమేశ్వరాలయంలో శుక్రవారం చతుర్దశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ గర్భగుడిలోని శివలింగానికి అభిషేకం, బిల్వార్చన, రుద్రాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి చేశారు. పలు గ్రామాలకు చెందిన భక్తులు భజన కీర్తనలను నిర్వహించారు. వారు ఆలపించిన భక్తిగీతాలు విశేషంగా ఆకట్టుకొన్నాయి. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జగదీశ్వర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, రాములు, శ్రీనివాస్, అనిల్‌స్వామి, కిష్టయ్య పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో మేరిమట్టి..మేరా దేశ్

అందోల్, అక్టోబర్ 13 : తెలంగాణ విద్యాశాఖ, ఉస్మానియాయునివర్సిటీ జాతీయసేవ పథకం ఉత్తర్వుల మేరకు శుక్రవారం జోగిపేట నెహ్రూ మెమోరియల్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో మేరామట్టి మేరా దేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా స్థానికంగా సేకరించిన మట్టిని కళాశాలలో ఉంచి ప్రత్యేక పూజలు చేసినట్లు వారు కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్, ఎన్‌సీసీ పోగ్రాం అధికారులు గోపాల్, అనసూయ, శ్రీకాంత్, పండరి తెలిపారు. ఇలా చేయడం వలన విద్యార్థుల్లో దేశభక్తి, దేశసేవలపై మరింత అవగాహన కలుగుతున్నదని తెలిపారు. మట్టి కళాశాలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు అడవిరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలకు అవగాహన

కోహీర్, అక్టోబర్13 : మండలంలోని దిగ్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో శుక్రవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తులసి, అజీమ్ ప్రేమ్‌జీ సంస్థ ఆధ్వర్యంలో ఆయా గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లకు చిన్నారుల చదువు, ఆటపాటల నిర్వహణపై అవగాహన కల్పించారు. చిన్నారులకు అర్థమయ్యేలా చార్టులు, బొమ్మల ద్వారా వివరించాలని వారు సూచించారు. కార్యక్రమంలో అజీమ్ ప్రేమ్‌జీ సంస్థ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.